


# పాపం..పుల్లారావ్!

- విశ్వమోహిని

పుల్లారావ్ బెంగంతా పాతికేళ్లు వచ్చినా తనకు పెళ్లికాలేదన్నదే! ఆరడుగుల పుల్లారావ్ పేరుకు తగ్గట్టే కొబ్బరి ఈనెలా, చీపురు పుల్లలా పీలగా వుంటాడు. పరాకుగా చూసినవారు అతన్ని నిటారుగా వున్న గెడ కర్రో, ఎలెక్ట్రిక్ పోలో అని పొరబడడం కద్దు. అందుకు నిదర్శనం- ఓసారి అతను ఓ కన్‌స్ట్రక్షన్ సైట్‌లో నిలుచుని ఎవరికోసమో వెయిట్ చేస్తూంటే... శీతాకాలపు మసక చీకటిలో అతన్ని 'పోల్'గా పొరబడ్డ లేడీ వర్కర్ అతని పీకకూ, సమీపంలో వున్న ఎలెక్ట్రిక్ స్తంభానికీ కలిపి తాడుకట్టి బట్టలు ఆరవేయబోయిందట!

తల్లిదండ్రులు తనకు ఆ పేరు పెట్టడంవల్లనే అలా పుల్లలా తయారయ్యాడో... లేక, తాను అలా వుంటాడని ముందుగానే ఊహించి ఆ పేరు పెట్టారో తెలీక తికమకపడుతూంటాడు. ఉద్యోగరీత్యా అతను హెల్త్ అసిస్టెంట్. గ్రామాలకు వెళ్లి ఆరోగ్యం గురించి, అందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ వివరించబోతే- 'మా ఆరోగ్యానికి వచ్చిన భయమేమీ లేదు కాని... ముందు నీ హెల్త్ సంగతి చూసుకోవయ్యా, వొంట్లో కేజీ కండ కూడా లేదు!'అంటూ ఎగతాళి చేసేవారంతా.

పుల్లారావ్‌కి లావుగా వున్న వారిని చూస్తే కించిత్తు ఈర్ష్యగా వుంటుంది. లావుపాటి వ్యక్తుల్ని చూసినపుడల్లా తన సన్నదనం ఇనుమడించినట్లు అనిపిస్తూంటుంది. వీధిలోకి వెళ్తే అంతా తననే చూస్తున్నట్టూ, పరిహాసంగా నవ్వుతున్నట్టూ ఫీలయిపోతూంటాడు. ఆకతాయి కుర్రాళ్లు కొందరు తనకు 'గోల్ పోల్' అనీ, 'తాటాకు బొమ్మ'అనీ నిక్‌నేమ్స్ పెట్టడమూ అతను ఎరుగనిది కాదు. తన 'ఫెదర్ వెయిట్' పర్సనాలిటీని చూసి ఆడపిల్లలు ఆత్మహత్యకైనా సిద్ధపడుతారు గాని, తనతో పెళ్లికి 'చచ్చినా వొప్పుకోరు'అనే స్నేహితుల పరాచికాలు వింటూంటే అతని బెంగ రెట్టింపు అయ్యేది.

ఓసారి పుల్లారావ్ ఎక్కడికో వెళుతూంటే హఠాత్తుగా పెద్ద గాలి వీచింది. అది సుడిగాలిగా మారి పుల్లారావ్‌ని కాగితంలా అమాంతంగా పైకి లేపేసింది. దాని విసురుకు దారం తెగిన గాలిపటంలా ఓ కిలోమీటరు దూరంవరకు ఎగురుకుంటూ వెళ్లి... గుండమ్మ అనే బండలా వుండే ఓ కూరగాయల బండమ్మ (బండి+అమ్మ) అడ్డు రావడంతో... చెక్క బల్లలాంటి ఆమె వక్షంలో చిక్కుకుపోయాడు. అతని పెదవులు ఆమె పెదవులకు అతుక్కుపోయాయి.

బల్లిలా తన గుండెలకు అంటుకుపోయిన పుల్లారావ్‌ని చూసి భద్రకాళీ అయిందామె. "ఉఫ్‌న ఊదితే ఎగిరిపోయే నీ చీపురుపుల్ల పర్సనాలిటీకి షకీలాలాంటి నేను కావలసి వచ్చానట్రా సచ్చినోడా? నడిరోడ్డుమీద నన్ను కౌగలించుకోవడానికి నీకెన్ని గుండెల్రా!?" అంటూ తిట్టినతిట్టు తిట్టకుండా బండబూతులు తిట్టింది. ఒంటిమీద వాలిన గొల్లభామను తీసి పడేసినట్టు ఎడంచేతితో అతన్ని విదిలించేసింది. ఆ విదుపునకు కూరగాయల బండిమీద పడ్డాడు పుల్లారావ్.

అంతటితో ఆగకుండా, "నామీద పల్లిగ్గా చెయ్యి వెయ్యడానికి నా మొగుడికే దమ్ములు చాలవ్. అలాంటిది ఏ దన్ను చూసుకుని నన్ను ముద్దుపెట్టుకున్నావ్‌రా పుల్లారావ్!?"అంటూ అరిచింది. పుల్లలా వున్నాడని 'పుల్లారావ్' అంటేకాని, అతని పేరు తెలీదు ఆమెకు.

పుల్లారావ్‌కి చచ్చేంత భయం వేసింది. సంజాయిషీ చెప్పుకోవడానిక్కూడా తనకు ఛాన్స్ ఇవ్వకుండా ఎ.కె.47లా నాన్‌స్టాప్‌గా ఫైర్ చేస్తోంది గుండమ్మ. కూరగాయల బండిమీంచి ఓ దూకుదూకి తూనీగలా అక్కణ్నుంచి తుర్రుమన్నాడు.

అదిగో, అప్పుడే...గట్టిగా శపథం చేసుకున్నాడు పుల్లారావ్-'భూ మండలం చంద్ర మండలంగా మారినా... చంద్ర మండలం భూమండలంగా మారినా' తాను మాత్రం లావెక్కి తీరాలని!

అందుకు చిట్కాలకోసం వెదుకుతూంటే, లావెక్కాలంటే తిండి బాగా తినాలన్నారు ఎవరో. కాని, తాను ఎంత తిన్నా లావెక్కడంలేదని వాపోతూంటే- దారిన పోతూన్న ఓ ఎద్దును చూపించి, "అది అంత బలంగా వుండడానికి కారణం ఏమిటో తెలుసా? నీలా, నాలా అన్నమూ, అడ్డమైన గడ్డీ తినదు. శుభ్రంగా ఉలవలు, మినప్పొట్టు దాణా తిని, కుడితి త్రాగుతుంది. ఎద్దు డయెట్‌ని ట్రై చేసి చూడు" అన్నాడు ఓ మిత్రుడు.

అతను ఆ మాటలు ఆట పట్టించడానికి అన్నా సీరియస్‌గా తీసుకున్న పుల్లారావ్ అన్నం తినడం మానేసి పశువుల మేతను భుజింపనారంభించాడు. నాలుగు రోజులు తిరక్కుండానే అది అరగక అజీర్తిచేసి వాంతులు, విరోచనాలూ పట్టుకున్నాయి. మందులు మ్రింగి, పది రోజులు మంచం పట్టాక గాని మామూలు మనిషి కాలేదు సరిగదా, మరింత పుల్లలా తయారయ్యాడు.

పుల్లారావ్ సమస్యను గూర్చి తెలుసుకున్న డాక్టర్, 'యోగాభ్యాసం చేయడంవల్ల శరీర దారుఢ్యం పెరగవచ్చుననీ, ప్రయత్నించి చూడమనీ' సలహాఇచ్చాడు.

యోగా శిక్షణ కేంద్రాలకు వెళ్లడానికి ఆత్మన్యూనతా భావం అడ్డు వచ్చింది పుల్లారావ్‌కి, తన పర్సనాలిటీ చూసి అంతా నవ్వుతారేమోనని, యోగా పుస్తకం కొనుక్కుని ఇంట్లోనే స్వయం సాధన ఆరంభించాడు. క్రమబద్ధంగా, నిదానంగా నేర్చుకునే ఓపిక లేకపోయింది అతనికి. 'పుప్పుయ్ రోజుల్లో కొత్త భాషలు నేర్చుకోవచ్చు'నన్నప్పుడు, వారం రోజుల్లో యోగా ఎందుకు నేర్చుకోలేను?... అనుకున్నాడు.

రోజుకు కొన్ని ఆసనాల చొప్పున వేస్తూంటే- మూడోరోజున వేసిన ఓ ఆసనం ప్రాణాంతకంగా మారింది. కాళ్లు రెండూ మెడకు పెనవేసుకుపోయి, చేతులు కాళ్లమధ్య ఇరుక్కుపోయి, విడిపించుకోలేక నానా అవస్థపడ్డాడు. ఆ ప్రయత్నంలో మెడ, నడుము బెణికి కదల్లేక, మెదల్లేక గిలగిల లాడిపోయాడు... కొడుకు అవస్థచూసి లబోదిబోమంటూ చుట్టుప్రక్కల వారిని పిలుచుకు వచ్చింది పుల్లారావ్ తల్లి. నలుగురు కలిసి అతన్ని మోసుకువెళ్లి సమీపంలోవున్న యోగా సెంటర్‌లో పడవేసారు. అక్కడ యోగా గురువు జాగ్రత్తగా పుల్లారావ్ చేతులు, కాళ్లు విడదీసి పంపించాడు. ఆనక మెడకు, నడుముకు తైలం రాసుకుని మర్దనా చేయించుకుంటే గాని నార్మల్‌కి రాలేదు పుల్లారావ్. బెంబేలెత్తిపోయిన తల్లి, కొడుకు మళ్లీ యోగాసనాల జోలికి వెళితే ఉరేసుకు చచ్చిపోతానని బెదిరించింది... దాంతో లావెక్కడానికి పుల్లారావ్ అవలంబించిన యోగారూట్ కూడా మూసుకుపోయింది. దాంతో అతని 'బెంగ ఇన్‌ఫ్లేషన్‌లా ఇన్‌ఫ్లేట్ అయిపోయింది.

పుల్లారావ్ వాలకం చూసి జాలిపడ్డ ఓ ఆసామీ, "సంతోషం సగం బలం అన్నారు. ఎప్పుడూ నవ్వుతూ వుంటే నీ ఆరోగ్యం దానంతటదే మెరుగవుతుంది"అని సలహాఇచ్చాడు. అంతేకాదు, 'లాఫ్టర్ క్లబ్'లో చేరితే అతని ఆశ, ఆశయమూ నెరవేరుతాయన్నాడు.

'ఏ క్లబ్‌లో ఏ పబ్బం వుందో!' అనుకున్న పుల్లారావ్, వెంటనే ఆ ఊర్లోవున్న లాఫ్టర్ క్లబ్‌లో చేరిపోయాడు. ప్రతి ఆదివారమూ పబ్లిక్ పార్క్‌లో సమావేశమై ఓ గంటసేపు జోకులు ప్రేల్చుకుంటూ విరగబడి నవ్వుతూండడం ఆ క్లబ్‌యొక్క 'వారపు' చర్య. వృద్ధులు, యువకులు, స్త్రీలు, పిల్లలు-అంతా కడుపులు పట్టుకుని మనసారా హాయిగా నవ్వుకుంటూంటారు.

వారితోపాటు నవ్వుల పంటలో పాలుపంచుకున్న పుల్లారావ్‌కి ఆనందం కలిగింది. ఆ నవ్వుల క్లబ్‌లో



★ త్రిఫలాచూర్ణాన్ని మూడు గ్రాములు రాత్రి పడుకునే ముందు గోరువెచ్చటి నీటితో తీసుకుంటే ఉబ్బసం వ్యాధి తగ్గుతుంది.

చేరాక తాము కలతలు, కష్టాలు మరచిపోయి ఎంత సంతోషంగా వున్నదీ, ఆరోగ్యం ఎలా పుంజుకున్నదీ, ఎలా వాళ్లు చేసిందీ సభ్యులు వివరిస్తూంటే ఆసక్తిగా ఆలకించాడు.

అనుక్షణమూ- 24/7- ముఖంలో నవ్వు పులుముకోవడం వల్ల కలిగే అద్భుతాలను గురించి సెక్రెటరీ వివరిస్తూంటే కుతూహలం హెచ్చింది.

రేయింబవళ్లు ప్రాక్టీస్ చేసి ముఖంలో పర్మనెంట్‌గా నవ్వుల రంగులు పులుముకున్నాడు పుల్లారావ్. ఏంచేసినా, ఎక్కడ వున్నా 'మల్లిక్' కార్టూన్‌లా పళ్లన్నీ ఇకిలించి నవ్వడం అలవాటు చేసుకున్నాడు. అయితే, అది మరో విధమైన ముప్పునకు దారితీస్తుందని ఊహించలేదు, పాపం!

'బీమింగ్ స్మైల్'తో చూస్తూంటే, దారినపోయే వారికి అతను తమను చూసి ఎందుకు నవ్వుతున్నాడో బోధపడక తెల్లబోయేవారు. కొందరైతే అపార్థం చేసుకుని కోపంతో ఉరిమి చూసేవారు. ఆడ లేడీసు(చీరలుకట్టే స్త్రీలన్నమాట!) అతని వంక అనుమానంగా చూస్తూ అప్రయత్నంగా పైటలు సర్దుకునేవారు. అతన్ని ఎరిగున్న వారంతా, 'పాపం, లావెక్కడం లేదన్న బెంగతో మెంటల్ అయిపోయినట్టున్నాడు!'అనుకుని జాలిపడేవారు.

ఓసారి పుల్లారావ్ సిటీ బస్‌లో ప్రయాణం చేస్తున్నాడు. ఈ సీటు దొరక్క నిలుచునే వున్నాడు. బ్రాడ్ స్మైల్‌తో బస్సంతా కలియజూస్తూంటే అతని చూపులు లేడీస్ సీట్‌లో బ్రాడ్‌గావున్న ఓ ఆండాళ్లుమీద పడ్డాయి. అదే క్షణంలో అతని వంక చూసిన ఆవిడ పుల్లారావ్ నవ్వును ఘోరంగా అపార్థం చేసుకుంది. ఆమె ఘీంకారంతో బస్ ఆగిపోవడమూ, 'మగ' సీట్లలో కూర్చున్న ఆమె భర్త లేచి నిలుచోవడమూ ఒకేసారి జరిగాయి.

"వీడెవడో నావంక చూసి పళ్లికిలిస్తున్నాడండోయ్!"అంటూ అరిచింది ఆండాళ్లు. "కళ్లుకూడా గిలికిస్తున్నాడు!" ఎఫెక్ట్ కోసమని కాస్తంత మసాళాకూడా జోడించింది. దాంతో పుల్లారావ్ పలుకులు చెవిలో వేసుకోకుండా అతని షర్ట్ కాలర్ పట్టుకుని పైకెత్తి, నాలుగు పీకాడు ఆవిడ భర్త.

"ఆడదంటే అలుసైపోయింది ప్రతి మగముండావాడికీను. చీపురు పుల్లలా వున్నా చిల్లర వేషాలు మానలేదు. ముదనష్టపోడు!" అంటూ - ఆమధ్య అలాంటి కేసు ఏదీ తారసపడక అరచేతులు దురదగావున్న బస్‌లోని నారీమణులు ఛాన్స్ దొరికింది కదా అని తలో చేయీ వేయడంతో బల్లిలా నేలకు కరచుకుపోయాడు పుల్లారావ్. ఆనక అతన్ని పూచిక పుల్లలా బస్ లోంచి బైటకు విసిరేశారు.

ఆ దెబ్బ(ల)కు తట్టుకుని మళ్లీ రోడ్డున పడ్డానికి వారంరోజులు పట్టింది పుల్లారావ్‌కి.

రోజులు గడుస్తూంటే... తానిక లావెక్కడన్న భీతి, పెళ్లికాదన్నబెంగ...దేశంలోని స్కాముల సంఖ్యలా పెరిగిపోసాగాయి అతనికి.

ఇలా వుండగా- ఓ సాయంత్రపువేళ ఇంటి బాల్కనీలో నిలుచున్నాడు పుల్లారావ్. ఆ సమయంలో ఎదుటి ఫ్లాట్ బాల్కనీలో హఠాత్తుగా ఓ మెరుపు మెరిసింది. కళ్లు నులుముకునీ, ఒళ్లంతా కళ్లు చేసుకునీ సాశ్చర్యంగా చూసాడు.

'గీతాసింగ్'లాంటి ఓ లావుపాటి అమ్మాయి అతని మదికి 'కితకితలు' పెట్టింది. ఇరవై ఏళ్లుంటాయి ఆమెకు. తెల్లగా, బొద్దుగా... పట్టు పరికిణీ- వోణీలతో, పాపిట చేరుతో ముద్దుగా వుంది.

'ఎంచక్కా పుష్టిగా ఎంత బావుందీ ఆ అమ్మాయి!' అనుకున్నాడు అప్రయత్నగా- ట్రేడ్‌మార్క్ బ్రాడ్‌స్మైల్‌తో, వైడ్ ఐస్‌తో రెప్పవేయకుండా ఆమెనే చూస్తూ. అంతకు మునుపు ఎప్పుడూ ఆమెను ఆ ఫ్లాట్‌లో చూసిన గుర్తులేదు. ఆమెను చూస్తూంటే అతని మనసుకు ఏదో తెలీని ఉల్లాసం కలిగింది.

ఆ పిల్ల అతన్ని చూడనే చూసింది. ఓ క్షణంపాటు ఆల్చిప్పల్లాంటి కన్నులతో రెప్పలు తాటిస్తూమరీ చూసింది. అతని నవ్వు, చూపులు తనకు గుచ్చుకున్నట్టనిపించాయో ఏమో... ముందుకు వేసుకున్న వాలుజడను విసురుగా వెనక్కివేసుకుని లోపలికి తుర్రుమంది.

ఆమె లోపలికి వెళ్లిపోయినా పుల్లారావ్ చూపులు మాత్రం ఆమె నిలుచున్న బాల్కనీకి ఫెవికాల్ వేసినట్టు అతుక్కుపోయి చాలాసేపు అలాగే వుండిపోయాయి. తల్లి కాంతమ్మ వచ్చి వీపుమీద ఒకటి చరిచి పిలిచేంతవరకు తేరుకోలేదు అతను.

'గీతాసింగ్'లాంటి ఓ లావుపాటి అమ్మాయి అతని మదికి 'కితకితలు' పెట్టింది. ఇరవై ఏళ్లుంటాయి ఆమెకు. తెల్లగా, బొద్దుగా... పట్టు పరికిణీ- వోణీలతో, పాపిట చేరుతో ముద్దుగా వుంది. 'ఎంచక్కా పుష్టిగా ఎంత బావుంది ఆ అమ్మాయి!' అనుకున్నాడు

"మన ఎదురింటాయన నీకోసం ఎందుకో వచ్చాడ్రా, పుల్లా!" అని తల్లి అనడంతో చిన్నగా ఉలిక్కిపడ్డాడు. మరో సమయంలోనైతే తల్లి తనను ముద్దుగా 'పుల్లా'అని పిలిచినందుకు తాడెత్తున లేచేవాడే. కాని, ఎదురింటాయన తనకోసం వచ్చాడనేసరికి గుండె గుభేల్‌మంది. ఆ మెరుపు కన్య తన మీద ఫిర్యాదు చేసిందని అర్థమైపోయింది.

ఎందుకంటే, లోగడ ఆ కాంప్లెక్స్‌లోని ఆడవాళ్లు కొందరు తన నవ్వును అపార్థం చేసుకుని గొడవ చేయడం కద్దు!

"నవ్వు నలభై విధాల బలం అన్నవారే, నాలుగువిధాల చేటు అని కూడా ఎందుకు అన్నారో ఇప్పుడు అర్థమవుతోంది!" అనుకుంటూ మెల్లగా హాల్లోకి వెళ్లాడు.

ఎదురింటి పాపారావునీ, అతని పక్కనే కూర్చున్న కోర చూపుల బుర్ర మీసాలాయన్నీ చూసి గతుక్కుమన్నాడు. నిశ్శబ్దంగా వెళ్లి వారి ఎదుట కూర్చున్నాడు. కాంతమ్మ వచ్చి కొడుకు వెనుక నిలుచుంది.

"ఇతను మా బావ శ్రీశైలం. తిరుపతిలో కాపురం. అన్నవరం వెళ్తూ నిన్ననే ఫ్యామిలీలో మా ఇంటికి వచ్చాడు"అంటూ బుర్రమీసాల ఆసామీని పరిచయం చేశాడు పాపారావు, కాంతమ్మను ఉద్దేశించి.

శ్రీశైలం అందుకున్నాడు- "ఇందాక మా అమ్మాయి నీతాశ్రీ బాల్కనీలో నిల్చుని వుంటే మీ అబ్బాయి తన వంక చూసి పళ్లు ఇకిలించాడట..." అదిరిపడ్డ పుల్లారావ్ కుర్చీలోంచి జారిపడబోయి సర్దుకున్నాడు.

"అపార్థం చేసుకోకండి బాబూ! మా పుల్లారావ్ ఒళ్లు రావడానికని ఈమధ్య నవ్వుల వ్రతమేదో చేస్తున్నాడు. ఇరవై నాలుగ్గంటలూ నవ్వుతూనే వుంటాడు. అంతే తప్ప మీ అమ్మాయిని చూసి కావాలని దురుద్దేశ్యంతో నవ్వలేదు. నన్ను నమ్మండి" ఎపాలజెటిక్‌గా అంది కాంతమ్మ.

ఆమె సంజాయిషీకి ముఖాలు చూసుకున్నారు బావమరదులు. "వ్రతమో, క్రతువో... మాకెలా తెలుస్తుంది! వయసులోవున్న ఆడపిల్లను చూసి బ్రహ్మచారి కుర్రాడు పళ్లికిలిస్తే... అది కోతిపనికాక నీతి పని అవుతుందా?" అన్నాడు శ్రీశైలం గంభీరంగా బుర్రమీసాలు దువ్వుకుంటూ. ఆ మీసాల దువ్వుడు చూస్తే అక్కణ్ణుంచి పారిపోవాలనిపించింది పుల్లారావ్‌కి.

"అంత మాటనకండి. మా పుల్లారావ్ ఎలాంటివాడో పాపారావ్ అన్నయ్యకు బాగా తెలుసు" అందావిడ. నచ్చజెప్పే ధోరణిలో.

ఫకాలున నవ్వేసారు బావమరదులు. వారు చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయింది కాంతమ్మ. పుల్లారావైతే అది కలో, నిజమో తెలీక తల్లి చేత గిల్లించుకుని కెవ్వున అరిచాడు.

కూతురికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు శ్రీశైలం. పిల్ల లావుగా వుందని మంచి సంబంధాలు రావడం లేదు. పోనీ తనలాగే లావుగా వున్నవాణ్ణి చూసి చేద్దామంటే, పిల్ల ససేమిరా అంటోంది. తనకు సన్నగా వున్నవాడే భర్త కావాలని పట్టుపట్టి కూర్చుంది... బాల్కనీలో పుల్లారావ్‌ని చూసి తొలిచూపులోనే ప్రేమించేసింది! పెళ్లంటూచేసుకుంటే అతన్నే చేసుకుంటానని పూజ గదిలో వున్న దేవుడి గంట తెచ్చి మ్రోగించి మరీ ఘంటాపథంగా చెప్పింది... సన్నగా వున్నా బుద్ధిలో మిన్న పుల్లారావ్ అన్న సంగతి పాపారావు ద్వారా తెలుసుకుని... ఆ సంబంధం కలుపుకోవాలని వచ్చాడు శ్రీశైలం...

నెల తిరక్కుండానే నీతాశ్రీ, పుల్లారావ్‌ల పెళ్లి ఫెళ్లున జరిగిపోయింది... శోభనంనాటి రాత్రి భార్యతో అన్నాడు పుల్లారావ్, "నా పర్సనాలిటీ నీకు నచ్చిందంటే నాకింకా నమ్మకం కలగడం లేదు సుమా"! అది నిజంగా నిజమేనా.

పతిశ్రీ ప్రశ్నకు సిగ్గుగా నవ్వి, "సన్నగా వున్నవాడు మనిషి కాదా, మగాడు కాడా?" అంది నీతాశ్రీ. అంతటితో ఆగకుండా, "సన్నము, లావు అన్నవి బాడీ కాన్‌స్టిట్యూషన్ మీద ఆధారపడి వుంటాయండీ. ఆత్మన్యూనతా భావం మనిషిని కృంగదీస్తుంది"అందామె. "మీకో విషయం తెలుసా? సన్నగా వున్నవారు లావుగా వున్నవారినీ... లావుగా వున్నవారు సన్నగా వున్న వారినీ కోరుకోవడం సహజం. ఆ నిజం తెలీక మీరు అన్ని అవస్థలు పడ్డారు పాపం!"

"నిజంగా!?" ప్రేమాభిమానాలతో ధైర్యంగా ఆమెను హృదయానికి హత్తుకున్నాడు పుల్లారావ్. అతని బిగి కౌగిట్లో సిగ్గులమొగ్గే అయిందామె.

'నవ్వుల వ్రతం'వల్ల పుల్లారావ్ వొళ్లు రాకపోయినా పెళ్లాం దొరికిందని అతని మిత్రులు ఆటపట్టిస్తే... తనను తననుగా ప్రేమించే ఇల్లాలు లభించిందన్న సంతోషంతో ఏడాది తిరక్కుండానే వొళ్లుచేసి పుష్టిగా తయారయ్యాడు పుల్లారావ్. అన్నట్టు, ఇప్పుడతను పేరు కూడా మార్చేసుకున్నాడు- 'పులిరావ్'అని!!

★

రచయిత చిరునామా:
విశ్వమోహిని,
పి.వి.వి.సత్యనారాయణ,
ఇం.నెం.7-1-222/1,
102, సిరిప్రైడ్,
బల్కంపేట, హైదరాబాద్- 500 016.



ఇంటి వైద్యం
★ క్షీర బలా తైలాన్ని 10-20 మి.లీ. 1/2 గ్లాస్ పాలతో (100 మి.లీ) కలిపి రోజుకు మూడుసార్లు సేవిస్తే ఆక్షేపక వాతం తగ్గుతుంది.